# హాలికులైన నేమి...

- నిడదవోలు మాలతి

అర్ధరాత్రి దాటింది. మనోరమా, ఇద్దరు పిల్లలూ పడకెక్కేసి మూడున్నర గంటలైయింది. చంద్రం కంప్యూటరుకి అంటుకు పోయి ఉద్యోగాలవేటలో వేసారి, రంగుబుడగలు షూట్ చెయ్యడం మొదలుపెట్టేడు. చుంయ్ చుంయ్ మంటూ పెనంమీద పెసరట్లలా స్క్రీనుమీద బుడగలు చితికిపోతున్నాయి.

"బుర్రతో పనిలేని ఆట ఆడుతున్నాను" చంద్రం గొణుక్కుంటున్నాడు చితికిపడుతున్న బుడగలు చూస్తూ.

"బుర్రతో పనిలేనిఆట." బుర్రతో పనిలేని ఆటే అయినా వదలబుద్ధి పుట్టడంలేదు. అలాగని మనశ్శాంతీ లేదు. ఈ పనికిమాలిన ఆట నేనెందుకు - ఆడుతున్నాను" అనిపిస్తోంది కానీ సమాధానం తోచడంలేదు. తనప్రమేయం లేకుండానే బుర్రో చెయ్యో ప్రోగ్రాము అయిపోయినట్టు, అసంకల్పిత ప్రతీకార చర్యలాగ ఆట సాగిపోతోంది. తాను "బుర్ర అక్కర్లేని ఆట ఆడుతున్నాన" ని చెప్పకోడం మాత్రం మానలేకుండా వున్నాడు.



నాలుగేళ్ళయింది వుద్యోగంలో చేరి.

మూడునెలలయింది వుద్యోగం పోయి.

చేరినప్పుడు ఇలా అవుతుందని అనుకోలేదు. అప్పట్లో ఆ కంపెనీ శుక్లపక్ష చంద్రునిమాడ్కి దినదిన ప్రవర్ధమానంగా పెరిగి పోతోందని విని చేరాడు. దేశంలో ఆర్థికపరిస్థితి ఎలా వుందో పింకుస్లిప్పు పుచ్చుకున్న రోజున గానీ గ్రహింపుకి రాలేదు. కళ్ళెదుట కొండచిలువలా కనిపిస్తున్న సమస్యలు కూడా "తన దాకా వస్తేగానీ" తెలీవని ఇప్పుడే తెలిసింది.

"బోడి వుద్యోగం. అదే దొరుకుతుంది ఇది కాకపోతే దీని తాతలాటిది" అని తనకి తనే చెప్పుకోడమే కాక, మనోరమకి కూడా మాటిచ్చాడు. మొదట్లో కొన్నాళ్ళు కులాసాగా గడిపేడు unearned holidays అనుకుంటూ. ఆ తరవాత తనకి తెలిసినవాళ్ళనీ, ఉద్యోగాల్లో వున్న వాళ్ళనీ కదిపి చూసేడు.

వాళ్ళు యథాశక్తి సానుభూతులు చెప్పి, ప్రస్తుతం తమకి తెలిసినవేమీ లేవనీ, తెలిస్తే మాత్రం తప్పకుండా చెప్తాం అనీ నొక్కి చెప్పేరు. ఏదైనా అవసరమయితే ఏ మాత్రమూ సంకోచించకుండా అడగమని కూడా చెప్పారు.

చంద్రం నెట్లోనూ, పేపర్లలోనూ కనిపించిన ఉద్యోగాలన్నిటికీ అర్జీలు పెట్టుకొస్తున్నాడు. రోజులూ, వారాలూ, దొర్లుకుపోతున్నయి నిస్సారంగా. monster లో కూడా తనపేరూ, అర్హతలూ, నమోదు చేసాడు. ఎన్ని సార్లు చూసినా ఏదో కంపెనీలో బుక్కు కీపింగ్ పని చూపిస్తోందే కానీ తన ఇంజనీరింగుచదువుకి తగిన పని కనపించడంలేదు. బుక్కు కీపింగ్ చెయ్యగలనన్న నమ్మకంలేదు.

మనోరమ పిల్లలు చదువుతున్న ఎలిమెంటరీ స్కూల్లో substitute teaching చేస్తూ వుంటుంది. అంచేత చెప్పకోదగ్గ ఆదాయం కాకపోయినా, కొంతలో కొంత నయం.

ఓరోజు జగదీశ్ బజారులో కనిపించాడు. ఆయనతో చంద్రానికి అట్టే పరిచయంలేదు.వూళ్ళోవున్న వందమంది భారతీయుల్లో అతనొకడని తెలుసంతే. కాస్త జంకు తూనే హలో అన్నాడు చిరునవ్వు మొహాన మెత్తుకుని.

జగదీశ్ మెకానికల్ ఇంజినీరు, వ్యవసాయపరికరాలు తయారు చేసే గ్రీన్ మెటల్ కంపెనీలో ఛీఫ్ ఇంజనీరు. అంచేత తను అతన్ని పలకరిస్తే, ఉద్యోగంకోసమేనని

అతను అనుకుంటాడేమోనని చంద్రం బాధ. ఆమాట నిజమే అయినా ...

జగదీశ్ కూడా సంకోచిస్తూనే తిరుగు హలో చెప్పాడు. అతని సంకోచానికి కారణం చంద్రం ఆలోచనకి అటువైపున్నది. "వీడికి ఉద్యోగం వుంది, నాకు లేదు" అని చంద్రం చిన్నబుచ్చుకుంటాడేమోనని జగదీశ్ బాధ. ఇలా ఇద్దరికిద్దరూ సంకోచిస్తూనే, సగం సగం మొహాల్తో హలోలు చెప్పుకుని, మీరెలా వున్నారంటే మీరెలా వున్నరాని అడుగుకొంటూ చిరు సంభాషణకి నాంది పలికేరు. ఆతరవాత చంద్రం ఉద్యోగం మాట రాక తప్పలేదు.

జగదీశ్ నెమ్మదిగా, "సారీ. మీకంపెనీలో జాబ్‌కట్సు గురించి విన్నాను" అన్నాడు.

చంద్రం "ప్చ్" అన్నాడు భుజాలు కుదించి. "ఇంతదాకా రానేవచ్చింది, ఇహనెందుకు మొహమాటం" అనుకుని, "మీ కంపెనీలో ఏవైనా అవకాశాలుంటే చెప్పండి. నాకు వూరికే కూర్చోవడం చాలా కష్టంగా వుంది" అన్నాడు ఆయనతో.

జగదీశ్ "అలాగే తప్పకుండాను. నేను మా హెచ్.ఆర్ ని కనుక్కుని చెప్తాను. మీసెల్లివ్వండి" అని నెంబరు తీసుకుని, శుభాకాంక్షలు చెప్పి వెళ్ళిపోయాడు.

చంద్రం ఆశలు మేస్తూ ఇల్లు చేరుకున్నాడు ఆపూటకి చాంద్రాయణం ముగించి.

నాలుగు రోజులయింది. జగదీశ్ కంపనీనుండి చంద్రానికి పిలుపు వచ్చింది.

"హలో. చంద్రంతో మాటాడాలి. వున్నారా?"

"యస్సస్. నేనే. చంద్రమే మాటాడుతున్నది"

"మీ విషయం జగదీశ్గారు చెప్పేరు. ఇంటర్వ్యూకి సోమవారం పదిన్నరకి వీలవుతుందా? లేక రెండు గంటలకా?"

ఆలస్యం అమృతం విషమని కదా నానుడి. "పదిన్నరకి రాగలను."

"సరే. మా హ్యూమన్ రిసోర్సెస్ డైరెక్టరుతో సోమవారం పదిన్నరకి మీ ఇంటర్వ్యూ నిర్ణయమయినది. మీకు ఎక్కడికి రావలెనో తెలుసా?"

తెలుసు, తెలుసు. సోమవారం పదిన్నరకి మీ హ్యూమన్-రిసోర్సెస్ డైరెక్టరుని కలుసుకోడానికి వస్తాను." అని వివరాలు వల్లేవేసి, తనకి అర్థం అయినట్టు తెలియజేసి, సెల్లు మూసి చంద్రం నెట్టూర్చేడు. తరవాత మనోరమతో చెప్పేడు తనకి రాబోయే వుద్యోగం సంగతి. ఆవిడ కూడా అతని ఆనందంలో పాలు పంచుకుంది.

సోమవారం, ఫలానాకంపెనీలో హెచ్.ఆర్ డైరెక్టరు థాంసన్‌ని కలుసుకున్నాడు. డైరెక్టరుగారు సాదరంగా మాట్లాడేరు. కంపెనీ అంతా చూపించేరు. అతని డ్యూటీ వివరించేరు. వేరే ఇంజినీర్లు వేసిన బ్లూప్రింటులు కంప్యూటరులోంచి తీసి, ప్రింటుచేసి, నీటుగా మడత పెట్టి వర్కర్లకి ఇవ్వడం.

"మీకు ఇష్టమయితే రేపే చేరొచ్చు" అన్నాడు థాంసన్, పక్కా వ్యాపారసరళిలో.

"గంటకి ఆరు డాలర్ల ఇరవై అయిదు సెంట్లు. రోజుకి ఎనిమిది గంటలు పని." అని కూడా చెప్పేడు.

చంద్రానికి ఛెళ్ళున మొహమ్మీద కొట్టినట్టుంది తాను చెయ్యబోయే పని తలుచుకుంటే. వెంటనే నాలుగు నెలలుగా తను పడుతున్న అవస్థలు మనసులో మెదిలేయి. "బుర్రతో పనిలేని పని నాకలవాటే" అని తనకి తనే, అక్కడికక్కడ నచ్చచెప్పుకుని, "సరే, రేపు వస్తాను" అని థాంసన్‌కి చెప్పి బయల్దేరేడు. కుంజర యాధంబు దోము కుత్తుకసొచ్చినట్టు గొంతులో వెగటు. తిన్నగా ఇంటికి వెళ్ళాలనిపించలేదు. దారిలో స్టార్ బక్స్‌లో ఆగి ఓ మూల కూర్చున్నాడు. బాలరసాలసాల నవపల్లవకోమల కావ్యకన్యకని తాను అమ్మకోవడంలేదు ... కానీ ...ఆ తల్లి పెట్టిన భిక్షే తన ఇంజినీరింగు చదువు. ఆ విద్యమూలంగానే తనకి, మనోరమకీ, పిల్లలిద్దరికీ కూడు. తన జన్మలో అనుకోలేదు ఆవిద్య విలువ ఇంతగా పడిపోతుందని.. మనోరమకి ఏమని చెప్పడం... రెండు గంటలసేపు ఆలోచించి, నెమ్మదిగా ఇల్లు చేరుకున్నాడు.

మనోరమ ఇంట్లోనే వుంది.

"రేపు చేరుతున్నా గ్రీన్ మెటల్‌లో" అన్నాడు మనోరమ మొహంలోకి చూడకుండా.

"నిజంగానే! పోన్లెండి. ఈరోజుల్లో ఇంత త్వరగా ఉద్యోగం దొరకడం గొప్పే" అంది మనోరమ.

"అవును" అనేసి లోపలికి వెళ్ళిపోయాడు చంద్రం.

ఈ పనికి ఇంజినీరింగు చదవక్కర్లేదు. హైస్కూలు చదువు చాలు.ఆమాట ప్రతిక్షణం ముల్లయి తాకుతోంది చంద్రం ఎదలో. రోజూ రాత్రి రంగుల బుడగలు చితగ్గొడుతున్నాడు "బుర్రలేని పని" "బుర్రలేని పని" అని గొణుక్కుంటూ.

రెండు మాసముల తర్వాత రెవ్యూకి పిలిచాడు థాంసన్.

ఆ సమయంలో చంద్రం తన హృదయబాధ వెళ్ళబోసుకున్నడు, "నేను ఇంజినీరుని. నాలుగేళ్ళ అనుభవం వుంది నాకు. అంచేత నాకు తగిన పని ఇవ్వండి" అని.

"మీరు చేరినరోజే చెప్పేం కదా ఈ పనిలో మీ విధ్యుక్తధర్మాలు. మీరు ఇష్టపడే చేరేరు."

"అవుననుకోండి. కానీ మీరూ గ్రహించే వుంటారు నా విద్యని మీరు అండర్‌యుటిలైజు చేసుకుంటున్నారని. గ్రోసరీ స్టోరులో సంచీలో కూరలు పెట్టేవాళ్ళకి గంటకి పన్నెండు డాలర్లు ఇస్తున్నారు.ఆపాటి చెయ్యనా ఇక్కడ?"

"ఎక్కడిపద్ధతులు అక్కడే. జేన్స్‌విల్లో కార్ల ఎసంబ్లీ చూసారా మీరు? కన్వేయర్ బెల్టుమీద కారు భాగాలు ఒకొకటే వస్తుంటాయి. ఒకడు తలుపు తగిలిస్తాడు. మరొకడు మేకు తగిలిస్తాడు. రోజంతా వారిపని అదే. రోజుకి ఎనిమిదిగంటలు అలా మేకులు తగిలించడమే. వాడికి గంటకి ముప్ఫై డాలర్లు." అన్నాడు థాంసన్. "మీరు చేయగలరా ఆపని?" అన్న ప్రశ్న ఆయన అడక్కపోయినా చంద్రానికి వినిపించింది.

ఉసూరుమంటూ వచ్చి తనసీటులో కూర్చున్నాడు. పక్కనున్న టేమీ జాలిగా అతనివేపు చూసింది.

"నీకు ఈపని చూపించింది ఎవరు?" అని అడిగింది.

"జగదీశ్. ఏం?"

"ఆయనకిచ్చే వందా నీకే ఇవ్వొచ్చు కదా."

"అదేమిటి?"

"ఈచెత్తపనికి ఎవరూ రారు. వచ్చినవాళ్ళు ఆర్నెల్ల కంటే వుండరు. అంచేత మనలాటివాళ్ళని తీసుకొచ్చి వీరికి అప్పచెప్పినవాళ్ళకి వంద డాలర్లు బోనస్ ఇస్తారు. పెద్దలకయితే వందా, పిన్నలకయితే యాభై."

చంద్రనికి బాధపడే ఓపిక లేదు. "ఓ" అనేసి వూరుకున్నాడు.

నాలుగు రోజుల తరవాత ఒకరోజు థాంసన్ కాఫీ షాపులో కనిపించేడు. చంద్రం మర్యాదకి హలోఅన్నాడు.

ఆయన తన పక్కన సీటు చూపించి అన్నాడు, "రండీ, చందారా! నాకో ఆలోచన వచ్చింది. మీరు వింటానంటే చెప్తాను."

"చెప్పండి."

"నేను రిటైరవుదాం అనుకుంటున్నాను. ఇప్పుడే కాదులెండి, మరో రెండేళ్ళకో మూడేళ్ళకో. అయోవాలో వంద ఎకరాలు మొక్కజొన్నతోట కొన్నాను. ఇప్పుడు ఎథెనాల్‌కి మంచి గిరాకీ వుందికదా. నేను ఇప్పుడప్పుడే ఆపని చేపట్టలేను. ప్రస్తుతానికి మానాన్న అక్కడ వున్నారు కానీ ఆయనకి మెషినరీ ఆపరేట్ చెయ్యడం చేతకాదు. అంచేత మీరు సాయం చేస్తానంటే చెప్పండి. మీది స్వెట్ ఎక్విటీ. లాభం ఇద్దరం పంచుకుందాం. వ్యాపారం అందుకునేవరకూ మీకు భుక్తికి లోపం లేకుండా చూస్తాను."

ఆయన ప్లాను అర్థం చేసుకోడానికి చంద్రానికి చాలాసేపు పట్టింది. ఆయన మాత్రం మామూలుగానే లోకరీతిన వ్యవహారదక్షతతో చెప్పుకుపోతున్నారు. మూడు చుట్లు కాఫీలయేయి.

చంద్రానికి ఇంతవరకూ గ్రీన్ మెటల్‌లో జరుగుతున్న నాటకం మనసులో మెదులుతోంది. "మంచి ప్లానులాగే వుంది" అన్నాడు సంధిగ్ధంగా.

"మంచి ప్లానే కానీ ఇంకా ప్రారంభదశలోనే వుంది. ఆలోచించుకోవలసిన విషయాలు చాలా వున్నాయి. మీకు ఆసక్తి వుంటే మాట్లాడుకుందాం." అన్నాడు బల్లమీద పది డాలర్లు పెట్టి.

చంద్రం వాలెట్ తీసేడు. "నో, నో. నేనిచ్చేశాను. మీరివ్వక్కర్లేదు." అని థాంసన్ వారించేడు.

చంద్రం ఇంటికొచ్చి రాత్రంతా ఆలోచించేడు. నిజంగా తనచదువుకు తగిన వుద్యోగం కాదు కానీ బుడగలు చితక్కొట్టడం కంటే మెరుగే.

పడగ్గదిలోకి వచ్చి చూస్తే, మనోరమచేతిలో పుస్తకం, కళ్ళు సీలింగుమీదా వున్నాయి.

థాంసన్ సలహాని మనోరమకి చెప్పేడు.

"మీరేం అనుకుంటున్నారు?"

"ఏమో, నాకేం పాలుపోడంలేదు. ఇప్పుడు చేస్తున్న పని కంటే మెరుగే. ఏదో పల్లెలో పడుంటాం." అని మంచంమీద వాలి, "హాలికులైననేమి... నిజదార సుతోదర పోషణార్థమై ..." అన్నాడు.

మనోరమకి కళ్ళలో నీళ్ళు తిరిగేయి.. భర్తకి కనిపించకుండా అటుతిరిగింది. తరవాత అతికష్టంమీద, గొంతు సవరించుకుని, "అంతేలెండి" అంది.

"అయినా ప్లాను ప్రారంభదశలోనే కదా వుంది. ఆలోచించుకోడానికి చాలా టైముంది" అన్నాడు చంద్రం తనని తనే నమ్మించుకోడానికి తంటాలు పడుతూ.